నెట్‌వర్క్ సమస్యపై బిఎస్ఎన్ఎల్ అధికారుల స్పందన

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలము బోరుభద్ర బిఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ సమస్య పై ఏపి టెలికం అధికారులు స్పందించినట్లు బోరుభద్ర గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త గొనపు అప్పన్న తెలిపారు. ఈనెల 7న బోరుభద్ర సెల్ టవర్ పరిధిలో కల పలు గ్రామాలకు చెందిన వినియోగదారులు నెట్‌వర్క్ సరిగ్గా లేక ఇబ్బందులకు గురవుతున్నారని లేఖలో పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ మేరకు స్పందించిన అధికారులు, ఫిర్యాదులో పేర్కొన్న గ్రామాల్లో కవరేజీ సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో, సకాలంలో పరిష్కరించేందుకు రాబోయే విస్తరణ ప్రాజెక్ట్‌లో నార్టెల్ బిటిఎస్ పరికరాలు కొత్తవి అమర్చటం ద్వారా మెరుగైన మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పిస్తామని ఏపీ టెలికాం విజయవాడ సర్కిల్ ఆఫీస్ నుండి సబ్-డివిజనల్ ఇంజనీర్ జి.ఫణికుమార్ ఇమెయిల్ తనకు తెలియజేసారని అప్పన్న తెలిపారు.

గ్రామీణ బంద్ కరపత్రం ఆవిష్కరణ

విశాలాంధ్ర-పలాస : ఈనెల 16న జరిగే దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ బొడ్డపాడు గ్రామ అమరవీరుల స్మారక భవనం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ 2014లో మోడి నాయకత్వంలో బిజెపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన నాటి నుంచి ఇదే స్వదేశ బహుళ కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను సహజీ వనరులను పరిశ్రమలను, బొగ్గును, రైల్వేను, అడవులను, కట్టబెట్టుతూ కార్పొరేట్ సంస్థలను విదేయుడుగా ఉంటున్నారని విమర్శించారు. కార్మిక, కర్షక, ప్రజల విధానాలకు వ్యతిరేకంగా విద్య కాషాయికరణకు, వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దుర్మార్గపు చర్యలకు వ్యతిరేకంగా ఈ నెల 16న పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ బంద్ కార్యక్రమంలో ప్రజలందరు పాల్గొని మోడి దుష్టపాలనను చరమగీతం పాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతీ కార్మిక సమైఖ్య శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి పి.దుర్యోదన, అధ్యక్షులు డి.నారాయణమూర్తి, ఎం.ధర్మా రావు, పురుషోత్తం, డి.శ్రీరాములు, త్రిలోచనరావు, టి.అప్పారావు, టి.రామారావు, టి.క్రాంతి, బాలరాజులు పాల్గొన్నారు.

పిఆర్సి వర్తింపచేయాలి : ఏపీ ఎన్జీవో డిమాండ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : పిఆర్సి మధ్యంతర భృతి 30శాతం తక్షణమే ప్రకటించాలని ఏపీ ఎన్జీవోస్ ఆమదాలవలస తాలూకా పరిధి అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు సమస్యలపై స్థానిక ఎమ్మార్వోకి బుధవారం మెమొరాండం అందించారు. 12వ పిఆర్సి తక్షణమే తన పని ప్రారంభించాలి. తక్షణమే ఒకటి జులై 2023 తేదీ నుండి మధ్యంతర భృతి (ఐ ఆర్) 30శాతం తక్షణమే ప్రకటించాలి. ఉద్యోగులు తమ సొంత డబ్బులు ను సబ్స్క్రిప్షన్ గా కడుతున్న పి ఎఫ్, ఏపీ జి ఎల్ ఐ సి లోన్, పార్ట్ పేమెంట్ దరఖాస్తులు నెలల తరబడి పెండింగ్ ఉంటున్నాయి. సరెండర్ లీవ్, మెడికల్ రీయింబర్స్మెంట్ 11వ పీఆర్సీ డిఏ బకాయిలు చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన వ్యక్తం చేసిన వారిలో అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. హరి కుమార్ వైస్ ప్రెసిడెంట్ గురుగుబెల్లి రాము, ట్రెజరర్ షేక్ భాష, జాయింట్ సెక్రెటరీ కె.మనోహర్, సుజాత, లీల రాణి, శ్రీలత, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్య పాఠశాలలో 200 మందికి సామూహిక అక్షరాభ్యాసం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం యర్నాగులపేట జంక్షన్ వద్ద ఉన్న అదిత్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల అవరణలో ఉన్న సరస్వతి మందిరంలో వసంత పంచమి సందర్భంగా కరస్పాండెట్ చింటు రాజారావు, ప్రిన్సిపాల్ శిమ్మ అప్పన్న అధ్యక్షతన బుధవారం ఉచితంగా 200 మంది చిన్నారులకు వేదపండితులు సుసరాపు అరుణ్ కుమార్ మంత్రోచ్ఛరణల మధ్య సామూహిక అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. విశ్రాంతి ఉపాధ్యాయులు మెండ రామినాయుడు, బొడ్డేపల్లి పాపారావు, రాళ్ళపాటి నర్సింహామూర్తి, పట్ట మల్లేశ్వరరావుల చేతులు మీదుగా ఈ అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఇంత మంది ఉపాధ్యాయులుచే అక్షరాభ్యాసం చేయటం ఎంతో సంతోషంగా ఉందని చిన్నారుల తల్లిదండ్రులు అనందం వ్యక్తం చేశారు. స్థానిక మండల విద్యాశాఖాధికారి సంపతిరావు అప్పలరాజు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమం చేయటం చాలా సంతోషకరంగా ఉందని పాఠశాల యాజమాన్యంకు అభినందించారు. అలాగే ఊడికలపాడు శ్రీరామమందిరంలో, దుర్గపేట ప్రభుత్వం పాఠశాలలో ఉపాధ్యాయులు సనపల కరుణ్‌కుమార్ ఆద్వర్యంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సనపల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు రాజపురం విద్యార్థులు

విశాలాంధ్ర-కవిటీ : ఈనెల 28వ తేదీన జాతీయ విజ్ఞాన దినోత్సవం సంద ర్భంగా ప్రతి పాఠశాల నుండి యూపీ,హై స్కూల్ లెవెల్ లో ఐదు ప్రాజెక్టులు చొప్పున ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవలసి ఉంటుంది. అందులో భాగంగా రాజపురం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఎల్ వెంకటరావు, ఉపాధ్యాయ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులకు అలాగే శిక్షణ అందజేసిన ఉపాధ్యాయులు ఎల్ వెంకటరావు, డి శ్రీదేవి లకు అభినందనలు తెలియజేశారు. ప్రాజెక్టులు తయారు చేయడానికి ప్రతి విద్యార్థి బ్యాంకు ఖాతాలో ఒక్కొక్కరికి 10వేలు రూపాయలు చొప్పున జమ చేయబడతాయని ప్రాజెక్టులు తయారుచేసి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనవలసి ఉంటుందని ఇన్చార్జ్ ఉపాధ్యాయుడు వెంకటరావు తెలిపారు.

ఎమ్మార్వో రమణయ్య కుటుంబాన్ని బొప్పరాజు వెంకటేశ్వర్లు పరామర్శ

విశాలాంధ్ర-నందిగాం : వైజాగ్‌లో హత్యకు గురైన ఎమ్మార్వో సనపల రమణయ్య కుటుంబాన్ని రాష్ట్ర రెవెన్యూ సర్వీసులు సంఘ అధ్యక్షులు, ఏ.పి. జె.ఏ.సి. అమరావతి ఛైర్మన్ బొప్పారాజు వెంకటేశ్వర్లు పరామర్శించారు. నందిగాం మండలం దిమిలాడ గ్రామం బుధవారం వెళ్లి రమణయ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి అన్నివిధాల రెవెన్యూ సర్వీసుల సంఘం అండగా ఉంటుంద నీ ధైర్యం చెప్పారు. ప్రభుత్వం నుండి వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనంలు తొందరగా వచ్చేలా తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నానని, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వం కి డిమాండ్ చేస్తాం అని తెలిపారు. రెవెన్యూ అసోసియేషన్ తరుపున శ్రీకాకుళం జిల్లా నుండి లక్ష రూపాయలు, విశాఖపట్నం జిల్లా నుండి లక్ష రూపాయలు కుటుంబ సభ్యులకు అందించారు. అన్నివిధాలుగా అసోసియేషన్ అండగా ఉంటుందని బరోసానిచ్చారు. ఈయనతోపాటు వైజాగ్ జిల్లా అధ్యక్షులు త్రినాథ్, శ్రీకాకుళం జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ పొదిలాపు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్. రాజు, జిల్లా ట్రెజరర్ జి.ఎల్.ఈ.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డివిజన్ అధ్యక్షులు సనపల కిరణ్ కుమార్, పలాస డివిజన్ అధ్యక్షులు రెయ్యి రామారావు, జిల్లా అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు దువ్వాడ అమర్నాథ్, గౌరీశంకర్, బెండి గిరి, వి.ఆర్. ఓ సంఘం తరుపున శ్యామ్, దాలప్పు, రమణ, వి.ఆర్.ఏ. సంఘం తరుపున రాష్ట్ర సహాయ కార్యదర్శి గోపి, రెవెన్యూ ఉద్యోగులు, విఆర్ఓలు, వి.ఆర్.ఎలు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరు ఏపీఓగా శేఖర్

విశాలాంధ్ర-జలుమూరు : మండల ఉపాధి హామీ పథకం ఏపీఓగా శేఖర్ బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లాలోని జామి మండలంలో పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా జలుమూరుకు వచ్చారు. శేఖరు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

తాగునీటి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం

విశాలాంధ్ర-హిరమండలం/పాతపట్నం: ఎమ్మెల్యే రెడ్డి శాంతి 265 కోట్ల రూపాయలతో తాగునీటి పథక పనులకు బుధవారం శ్రీకారంచుట్టారు. 265 కోట్ల రూపాయలు ఖర్చు తో మెగా తాగునీటి పథకం పనులు వీలైనంత తొందరగా ప్రారంభించాలని దానికి తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను బుధవారం ఆదేశించారు. ఎమ్మెల్యే రెడ్డి శాంతి క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్ ప్రసాద్, ఇతర ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశమయ్యారు. ఈ మెగా తాగునీటి పథకం ద్వారా పాతపట్నం నియోజక వర్గంలో ఉన్న ఐదు మండలాల్లో సుమారు 440 గ్రామాలకు తాగునీరు సరఫరా చేయటం జరుగుతుందని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : రక్తదానం చేసి మరొకరికి ప్రాణదాతలుగా నిలవాలని డాక్టర్ చింతాడ సుధీర్ అన్నారు. పుల్వామా దాడిలో అసువులు బాసిన అమరవీరులకు నివాలి అర్పిస్తూ ఆ నలుగురు ట్రస్టు ఆధ్వర్యంలో ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 26 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో మందికి సరైన సమయానికి రక్తం అందిస్తున్న ఆ నలుగురు ట్రస్టుకి అభినందనలు తెలుపుతూ ఎప్పటికప్పుడు యువత ముందుకు వచ్చి రక్తదానం చేస్తూ మరి ఎంతోమంది ప్రాణాలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఆ నలుగురు ట్రస్టు సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, ఢిల్లీరావు, టి.భాగ్యలక్ష్మీ, శివారెడ్డి, ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటికి అధిక ప్రాధాన్యత

సర్పంచ్ బద్రి ప్రకాష్

విశాలాంధ్ర-కవిటి: గ్రామాలలో తాగునీటికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు సర్పంచ్ బద్రి ప్రకాష్ తెలిపారు. ఈమేరకు బుధవారం మండలంలోని బి.గొనపపుట్టుగ గ్రామపంచాయతీ పరిధిలోని బిజీ పుట్టుగ, బాలాజిపుట్టుగ, కొర్రాయిపుట్టుగ, లండవీది, బెవరపుట్టుగ, లోట్టిపుట్టుగ గ్రామాలలో జిల్లా పరిషత్ నిధులు, మండల పరిషత్ నిధులు, పంచాయితీ నిధులు 8.70 లక్షల రూపాయల అంచనాతో నూతన విద్యుత్ మోటార్ బోర్లకు భూమి పూజ స్థానిక సర్పంచ్ బద్రి ప్రకాష్ చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిత్యాన్నదాన విరాళం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట సమీపంలో గల సీతయ్యఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించ బడుతున్న వృద్ధాశ్రమంలో వయోవృద్ధుల నిత్యాన్నదాన సేవలకు సోంపేటకు చెందిన విశ్వ మీనాక్షి కుటుంబ సభ్యులు బుధవారం 10,116 రూపాయలు విరాళంగా అందజేశారు. మీనాక్షి కుటుబానికి ఫౌండేషన్ నిర్వాహకులు గుళ్ల రమేష్, మోహనరావు సోదరులు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్నాథస్వామి ఆలయానికి ఎంపీటీసీ రూ. లక్ష విరాళం

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : మండల కేంద్రం సంతబొమ్మాళిలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయానికి, సంతబొమ్మాళి ఎంపీటీసీ దూబ వేణుగోపాల రాజు లక్ష్మి దంపతులు బుధవారం లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఈ ఆలయం నిర్మాణం పూర్తయి ఈనెల 25న ప్రతిష్ట కార్యక్రమం జరగనుంది. పెద్ద ఎత్తున జరగనున్న ఈ కార్యక్రమానికి గ్రామస్తులు, భక్తులు సహాయ సహకారాలు అందించారు. ఇందులో భాగంగా సంతబొమ్మాళి ఎంపీటీసీ వేణు దంపతులు లక్ష రూపాయలు జగన్నాథ స్వామి ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈకార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి శిమ్మ సోమేశ్వరరావు, గొలివి లక్ష్మణరావు, ధర్మాన జనార్దన రావు, సాయిరాం ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రథసప్తమి ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలన

- భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదు
- పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్

విశాలాంధ్ర-అరసవల్లి/శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీసూర్యనారాయణ స్వామివారి రథసప్తమి వేడుక ఈనెల 16వ తేదీన జరగనున్నన్న నేపథ్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమూన్, ఎస్పి.జి ఆర్ రాధిక రథసప్తమి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ క్రమంలో ముందుగా ఆలయ అర్చకులు కలెక్టర్‌కి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులతో స్వామివారి ఆలయ ప్రాంగణం తోపాటు ఇంద్ర పుష్కరని, ఉచిత దర్శనంతో పాటు, విఐపి, వివిఐపి దర్శనం మార్గాల ఏర్పాట్లుపై అరా తీశారు. దర్శనం నిమిత్తం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు జరగాలని అధికారులు ఆదేశించారు. అదేవిధంగా రథసప్తమి రోజున ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకండా పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులు సూచించారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా భక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లు 80 అడుగుల రహదారి మార్గంలో వాహనాల పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. దర్శన మార్గాలలో నాణ్యమైన భారికెడులను ఏర్పాటు చేయాలన్నారు. దర్శనం పూర్తి చేసుకొన్న తర్వాత భక్తులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆలయం నుంచి బయటకు వెళ్లేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసు కంట్రోల్ రూం ఏర్పాటు చేసి భక్తులకు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. సీసీ కెమెరాలు ద్వారా నిరంతరం నిఘా ఉంచాలని అదేశించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ, సి.హెచ్ రంగయ్య, ఎండోమెంట్ ఆర్జెసి విజయకుమార్, సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్ పట్నాయక్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పలాస టీడీపీలో వజ్జ అసంతృప్తి..?

విశాలాంధ్ర-పలాస: పలాస నియోజకవర్గం టీడీపీలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వజ్జ బాబూరావుతో పాటు ఆయన వర్గీయులు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇటీవల పలాస మండలం కంబిగాం జంక్షన్ వద్ద నిర్వహించిన శంఖారావం సభలో పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సభలో ప్రోటోకాల్ పాటించలేదని, రాష్ట్ర టీడీపీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న వజ్జ బాబూరావును వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించినట్లు, ఈ విషయంలో ఇన్‌చార్జీ గౌతు శిరీషా వర్గీయులు వజ్జను పక్కకు పెట్టినట్లు ప్రచారం జరుగుతోంది. 1995లో వజ్జ బాబూరావు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా టెక్కలి నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల్లో దివంగత నేత ఎన్టీఆర్‌పై పోటీ చేశారు. ఆ తరువాత పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్‌గా 5 ఏళ్లు పని చేశారు. 2014 ఎన్నికల్లో పలాస అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ తరుపున పోటీ చేశారు. వైసీపీని వదిలి గత ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీలోకి చేరిన వజ్జ బాబూరావు పార్టీ అభివృద్ధికి కృషి చేసినా టీడీపీలో తనకు సముచిత స్థానం కల్పించడంలేదనే ఆవేదనతో ఉన్నట్లు సమాచారం. గత మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ హవాలో కూడా పలాసలో 6 కౌన్సిలర్ల స్థానాలను టీడీపీ కైవసం చేసుకునేందుకు వజ్జ ఎంతగానో కృషి చేశారు. ఆయన రాజకీయ సీనియార్టీని తెలుగుదేశం పలాస నియోజకవర్గం నాయకులు గౌరవించక పోవడంతో వజ్జ అనుచరుల్లో ఆందోళన నెలకొన్నట్లు తెలుస్తోంది. బలమైన కాళింగ సామాజిక వర్గానికి చెందిన వజ్జ బాబూరావుకు జరిగిన పరాభవంతో కాళింగ వర్గీయుల్లో గౌతు వ్యవహరిస్తున్న తీరు పట్ల అసంతృప్తిగా ఉన్నట్లు బోగటా. ఈ నేపథ్యంలో వజ్జ బాబూరావును టీడీపీ వదిలి వైసీపీలో చేరాలని కొంతమంది ఆయనకు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. వజ్జకు జరిగిన అవమానం పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతుంది. మర్రిచెట్టు నీడలో మొక్కలు ఎదగవనే నానుడిని టీడీపీ నిజం చేస్తుందని, వచ్చే ఎన్నికల్లోగా వజ్జ తన నిర్ణయాన్ని మార్చుకొని టీడీపీకి దూరమవుతారని విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం.

రోడ్లు అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం : ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర-హిరమండలం : రాష్ట్ర రోడ్లు అభివృద్ధి, రాష్ట్ర ప్రజలు సంక్షేమము, ప్రజా శ్రేయస్సు, విద్యా వైద్యం, రైతు లు శ్రేయస్సు,, మహిళలు శ్రేయస్సు, పథకాలు ఇలా అన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తోనే సాధ్యమని పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యురాలు రెడ్డి శాంతి అన్నారు. బుధవారం పాతపట్నం నియోజకవర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి హిరమండలం మండలం లోని కల్లట గ్రామలో రూ.100 లక్షల రూపాయలతో స్టేట్ డెవలప్మెంట్ స్కీం నిధులతో చేపట్టిన నౌతల - ముఖలింగం రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే శాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, రాష్ట్ర అభివృద్ధి ఇంకా కొన సాగాలన్న మళ్ళీ మళ్ళీ వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ని ముఖ్యమంత్రి గా కొనసాగాలని పిలుపు నిచ్చారు. పాతపట్నం నియోజకవర్గ ప్రజలు రెండు సార్లు వైస్సార్సీపీ నే గెలిపించారని ఇప్పుడు ముచ్చట గా మూడో సారి భారీ మెజారిటీతో నన్ను గెలిపిస్తున్నారని ఎమ్మెల్యే శాంతి అన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా ఎప్పుడు చూడని విధంగా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖ లు తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్ దేనని కొనియాడారు. లెక్క లేనన్ని సంక్షేమ పథకాలు ఇవన్నీ కొనసాగాలంటే మళ్ళీ ఫ్యాన్ గుర్తు కే ఓట్లు వేసిభారీ మెజారిటీ తో గెలిపించాలని అభ్యర్ధించారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు జెసిఎస్ మండల కన్వీనర్ అంధవరం వెంకట్ సురేష్, మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, రెడ్డి జగదీశ్, చక్క బాలకృష్ణ, సర్పంచ్ లీలావతి, పొట్నూరు సింహచలం, గేదెల సూర్యం, నక్క ఆనంద్, పి.చందు, పి.నీల మోహన్, ఎన్ కన్నబాబు, బి.అప్పారావు, వి.చిన్నారావు, బుర్లే శ్రీను, ఆర్అండ్‌బి అధికారులు ఎస్ ఈ జాన్ సుధాకర్, ఈఈ రవి నాయక్, డిఈ సాగర్, జెఈఈ బి.గోపాల్‌రావు ఈఓపిఆర్డీపి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలకి వారసుడు సంజీవయ్య

ఏఐమ్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అంబేద్కర్ చూపిన మార్గంలో నడిచి ఆయన ఆశయాలకు వారసుడు దామోదరం సంజీవయ్య అని ఏఐమ్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను అన్నారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం మహనీయులు చూపిన బాటలో ఏఐమ్ ముందుకు సాగుతంద న్నారు. శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్ వద్దగల దామోదరం సంజీవయ్య పార్క్‌లో అంబేద్కర్స్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో సంజీవయ్య 104వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో ఏఐమ్ నాయకులు దామోదరం సంజీవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అక్కడికి హాజరైన వారిని ఉద్దేశించి శ్రీను మాట్లాడుతూ సంజీవయ్య నిరాడంబర రాజకీయాలకు మారుపేరుగా నిలిచారని అన్నారు. సంజీవయ్య ఉమ్మడి రాష్ట్రాలకు ముఖ్యమంత్రిగా పదవి నిర్వహించి నప్పటికీ ఆయన అవినీతి లేని రాజకీయాలు అందించారని పేర్కొన్నారు. దళిత, బడుగు, బలహీన వర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులు సంజీవయ్య ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు. దామోదరం సంజీవయ్య ఒకప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి అని, విలువలకు కట్టుబడి బతికిన అతి కొద్దిమంది రాజకీయ నాయకుల్లో ఒకరని నేటితరానికి తెలియజెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు కట్టబెట్టిన అధికారాన్ని స్వప్రయోజనాలకు వాడుకోకూడదన్న నియమానికి కట్టుబడ్డ నేత సంజీవయ్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐమ్ నాయకులు పురుషోత్తం రాంబాబు, పెయ్యిల చంటి, పంకు మురళీ, సుత్తి సుంతోష్, శీర రాజేశ్వరి, సాకేటి నాయుడు, సుంకు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్చార్జ్ బగ్గు రమణ మూర్తి

విశాలాంధ్ర-జలుమూరు : బాబు ష్యూరిటీ -భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా గుగ్గిలి పంచాయతీలలో గుండువలస, గుగ్గిలి గ్రామాల్లో బుధవారం బగ్గు రమణమూర్తి గ్రామ పుర వీధుల్లో పర్యటించి ఇంటికి టీడీపీ -జనసేన ఉమ్మడి పార్టీల మేనిఫెస్టో ను పేర్కొన్న విధంగా అమలు చేయనున్న పథకాల గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. రాష్ట్రములో వైసీపీ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అరాచకాలు, మోసాలను వివరించారు. అనంతరం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి రమణమూర్తి మాట్లాడుతూ తెదేపా మేనిఫెస్టోతోనే ప్రజల భవిష్యత్తు బంగారం అవుతుందన్నారు. వైకాపా ప్రభుత్వం వల్ల రాష్ట్రం సర్వనాశనమైందని.. వైకాపాను సాగనంపకపోతే పేదలందరూ నిరుపేదలకు మారే ప్రమాదం ఉందన్నారు. పేదల తలరాతలు మారాలన్నా, అన్నివర్గాల వారికి రక్షణ ఉండాలన్నా, ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు, ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20 వేల సాయం, మహిళలకు నెలకు రూ. 1500స్త్రీ నిధి, ప్రతి కుటుంబానికి ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు, ప్రతి నిరుద్యోగికి నెలకు 3వేల రూపాయల సాయం ఇవన్నీ అందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిందే అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు బగ్గు సునీల్, మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేంద్ర నాయుడు, ప్రధాన కార్యదర్శి బగ్గు గోవిందరావు, సర్పంచ్లు దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, జుత్తు అప్పలనాయుడు, గుండ రామకృష్ణ, టెంక కృష్ణ, బుద్దల నందీష్, బుద్దల శాంతరావు, గ్రామ నాయకులు కార్యకర్తలు అభిమానులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళి

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని పెద్ద ఎర్రగోవింద పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు దేవదాస్ ఆధ్వర్యంలో పుల్వామా దాడికి అమరులైన వీర జవాన్లకు బుధవారం ఘన నివాళులు అర్పించారు. పుల్వామా దాడికి ఐదేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి ప్రధానోపాధ్యాయులు దేవదాస్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో 40 మంది సిఆర్‌పిఎఫ్ సిబ్బందికి నివాళులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్లెపాడులో... మండలంలోని గొర్లెపాడు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సీతంనాయుడు ఆధ్వర్యంలో పుల్వామా దాడి లో మరణించిన 40 మంది సిఆర్పిఎఫ్ సైనికులకు విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయులు సీత%శీ%నాయుడు మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్ము శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ సైనికులను తీసుకువెళ్తున్న వాహనాల కాన్వాయ్ మీద లేథిపురా (అవంతిపురా సమీపంలో) కారుతో ఆత్మాహుతి బాంబు దాడి జరిగిందని ఈ దాడి కారణంగా 40 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) సైనికులు,ఒక ఉగ్రవాది మరణించారని తెలియ జేశారు. పాకిస్తాన్‌లో నెలకొని కార్యకలాపాలు సాగిస్తున్న ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ జైష్-ఎ-మహమ్మద్ ఈదాడికి బాధ్యత ఉన్నట్టుగా ప్రకటించుకుందని తెలియజేస్తూ, ఈ దాడికి ప్రతి దాటిగా మన భారత ప్రభుత్వం జైష్-ఎ-మహమ్మద్ స్థావరాన్ని గుర్తించి ప్రతి దాడి చేయడం జరిగిందని విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు జోహార్ అమరవీరులారా జోహార్ అంటూ వివిధ రకాల పిరమిడ్ల ద్వారా అమరులైన వీర జవాన్ల కు నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది ధర్మారావు, కళ్యాణి, మోహన్ రావు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్-23ని రద్దు చేయాలి

- మంత్రి ధర్మాన ప్రసాదరావును కోరిన అధ్యక్షులు సూర్యారావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రజాప్రయోజనాలకు ఇబ్బందిగా ఉన్న ఎపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ -23ని రద్దు చేయాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు కోరారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును కలుసుకొని వినతిపత్రం అందజేశారు. అనంతరం చట్టం వల్ల కలిగే ఇబ్బందులను చర్చించారు. ఈ చట్టం అమలైతే 60వేల మంది న్యాయవాదులకు ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. దీనిని మంత్రి ధర్మాన ప్రసాదరావు సానుకూలంగా స్పందిస్తూ చట్టం పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదని, దీనిపై న్యాయవాదుల అభిప్రాయాలను స్వీకరిస్తున్నామని చెప్పారని వివరించారు. ప్రజల, న్యాయవాదుల అభిప్రాయాలను కూలంకుషంగా పరిశీలించి న్యాయ నిపుణులతో చర్చించిన తరువాత అమలు నిర్ణయం తీసుకుంటామని చెప్పారని సూర్యారావు చెప్పారు. ఆయనతో పాటు సీనియర్ న్యాయవాది భవానీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి ఉన్నారు.

విద్యాదీక్ష బూనిన డి.జి.పురం విద్యార్థులు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం డిజిపురం జడ్పీ హైస్కూల్‌లో వసంత పంచమి సందర్భంగా హెచ్ఎం కోత చైతన్య ఆధ్వర్యంలో బుధవారం 81మంది పదో తరగతి విద్యార్థులు విద్యాదీక్ష చేపట్టారు. సరస్వతి ప్రార్థనతో ప్రారంభించి విద్యార్థులు ఒకరికొకరు దీక్షా కంకణాలు ధరించి, పబ్లిక్ పరీక్షలు ముగిసే వరకు టీవీలు, మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటామని, ఆటపాటలకి, విందులు,వినోదాలకు దూరంగా ఉండి సమయం వృధా చేయకుండా చదువుపైనే దృష్టిపెడతామని ఆఖరు పరీక్ష వరకు ఈదీక్ష కంకణము ధరించి ఆరోజు సరస్వతిమాతకు సమర్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తూట భాస్కరరావు పాల్గొన్నారు.

పోలాకిలో మండల స్థాయి యోగా పోటీలు

విశాలాంధ్ర-పోలాకి : మండల స్థాయిలో శ్రీ తాడి దాలెమ్మయర్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి తాడి సత్యశ్రీ వెంకట శివరామకృష్ణ తెలిపారు. మండల స్థాయిలో నిర్వహించనున్న పోటీలు 20 ఫిబ్రవరి 2024 న పోలాకిలో జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొన్న వారు ఈనెల 19లోగా నంబరు 9346707343 కి సంప్రదించగలరని కోరారు.

స్వామివారి ఆశీస్సులు అందుకున్న యువ నాయకులు

విశాలాంధ్ర-పోలాకి: మండలంలో గల రాళ్ళపాడు కాలనిలొ వెలసిన పంచముఖ ఆంజనేయస్వామివారి ఆశీస్సులు యువ నాయకులు ధర్మాన కృష్ణ చైతన్య అందుకున్నారు. బుధవారం ఆలయం 11 వార్షికోత్సవ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న రాష్ట్ర బీసీ సెల్ జోనల్ ఇంచార్జ్ నరసన్నపేట నియోజకవర్గం యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్యతో పాటు పోలాకి ఎంపీపీ ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు పార్టీ అధ్యక్షులు కణతి కృష్ణారావు బీసీ సెల్ జిల్లా కార్యదర్శి చింతాడ ఉమ రెంటికోట త్రినాధరావు సర్పంచ్ బోర సోమేశ్వరరావు రావాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆశీర్వాదం అందుకున్న బగ్గు

విశాలాంధ్ర-పోలాకి: రాళ్లపాడులో వెలసిన ఆంజనేయస్వామి11వ వార్షికోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించి ఆశీర్వాదం అందుకున్నారు. ఒడలంలో గల రాళ్లపాడు గ్రామంలో శ్రీశ్రీశ్రీ పంచముఖ అభయ ఆంజనేయ స్వామి ఏకాదశి 11వ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకుస్వామివారి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసి స్వామి వారికి పూజలు నిర్వహించి, తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.కార్యక్రమంల మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, మాజీ

కొర్లాంలో మెగా ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-సోంపేట : మండలం కొర్లాం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సుమారు 300 మంది రోగులు హాజరయ్యారు. అనుభవజ్ఞులైన వైద్యులు రోగులను తనిఖీ చేసి అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. తీవ్ర అనారోగ్యం గల వారికి జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ పూజిత, డాక్టర్ మణిదీప్, విఆర్వో గోపి, మేనేజర్ చిన్నారావు, సర్పంచ్ ప్రతినిధి రాంబుడ్డి గణపతి, ఉపసర్పంచ్ తామాడ వాసుదేవరావు, తామాడ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

జలంత్రపోలమ్మ తల్లికి వెండి మకర తోరణం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణం శ్రీశయనవీధిలో వెలసిన శ్రీజలంత్రపోలమ్మ తల్లికి సోంపేటకు చెందిన తంగుడు ఆనందరావు జలజ దంపతులు వెండి మకర తోరణాన్ని బుధవారం విరాళంగా అందజేశారు. సుమారు 700 గ్రాముల వెండితో తయారు చేసిన మకరతోరణం 60వేల రూపాయల విలువ ఉంటుందని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గేదెల బాబ్జీ పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులు దాతలపై ఎల్లవేళలా ఉండాలని కోరారు.

జయమ్మకు నివాళిగా వారం రోజులు స్మారక దినాలు

విశాలాంధ్ర-పలాస : వీరనారి జయమ్మ నాలుగో వర్ధంతి సందర్భంగా ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు విప్లవ నివాళ్లుతో శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా వారం రోజుల స్మారక దినాలను పాటించాలని సిపిఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలక్రిష్ణ కోరారు. బుధవారం న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా కమిటీ పిలుపు మేరకు జయమ్మ స్మారకంగా బొడ్డపాడులో జరిగిన కార్యక్రమంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగే సమరశీల ప్రజా ప్రతిఘటన పోరాటాలే కామ్రేడ్ జయమ్మకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని, విప్లవ దీర వనితగా పోరానారిగా జయమ్మ అందించిన విప్లవ స్ఫూర్తితో భూస్వామ్య, సామ్రాజ్యవాద వ్యతిరేక నూతన ప్రజాస్వామిక విప్లవ కర్తవ్యాలను ముందుకు తీసుకుపోతామన్నారు. 22న శ్రీకాకుళం ఎన్‌జివో హోమ్‌లో జరిగే కామ్రేడ్ జయమ్మ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి శీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ, పివోడబ్ల్యు జిల్లా ట్రెజరర్ కుత్తుం హేమక్క, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, జె.అప్పయ్య, జి.కామేశ్వరరావు, ముఖలింగం, ఆర్.సింహాద్రి, ఉమాలు పాల్గొన్నారు.

పాత పింఛను విధానం అమలుచేయాలి

విశాలాంధ్ర-పలాస : సిపిఎస్, జిపిఎస్ రద్దుచేసి పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని ఎపిఎన్‌జిజివో అసోసియేషన్ అధ్యక్షులు బోనెల గోపాల్ కోరారు. బుధవారం రాష్ట్ర ఎపిజెఎసి పిలుపు మేరకు పలాస ఎంపిడివో కార్యాలయం, సచివాలయం, ఎంఈవో కార్యాలయం, సిటివో కార్యాలయం, ఎస్‌టివో కార్యాలయాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన తెలియజేశారు. అనంతరం పలాస డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈయన మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పింఛన్లు ప్రభుత్వాన్ని సహకరిస్తున్న ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేకపోవడంతో పోరుబాట పట్టక తప్పలేదన్నారు. క్రాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజేష్ చేయాలని, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, 11వ పిఆర్‌సి ఏరియర్స్ సరౌండర్ సెలవులు, పిఎఫ్, ఎపిజిఎల్ఐ, మెడికల్ రీయింబర్సుమెంట్ వెంటనే విడుదల చేయాలని, అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని, ప్రతి నెల 1వ తేదీన జీతాలు, పింఛన్లు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఎపిఎన్‌జిజివో వైస్ ప్రెసిడెంట్ పి.శ్రీనివాసరావు, ట్రెజరర్ ఎన్.ఉపేంద్ర, జాయింట్ సెక్రటరీ ఉదయ్‌శంకర్ పాత్రో, ఉమెన్ వింగ్ సెక్రటరీ రోజా, జాయింట్ సెక్రటరీ కంచరానా చాణుక్య, లావణ్యకుమార్, సర్వేరు వై.గిరి, విఆర్‌వో ఖగేశ్వరరావు, సెక్రటరీ అప్పారావు, వివిధ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

బారువ గ్రోయిన్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం పాలపలస గ్రామం వద్ద బారువ పరిసరాలకు సాగునీరు అందించే గ్రోయిన్ నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత పిరియా సాయిరాజ్, స్థానిక ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, బారువ సర్పంచ్ ఎర్ర రజనీ కుమారితో కలిసి శంకుస్థాపన చేశారు. 24.5లక్షల బిఎంఎఫ్ నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి గ్రోయిన్ నిర్మాణ పనుల వద్దకు సాయిరాజ్ చేరుకున్నారు. కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి బారువ రైతాంగానికి సాగునీటి సౌకర్యం మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గుర్రాల శ్రీను, శిలగాన భాస్కరరావు, బుద్దాన శ్రీకృష్ణ, అమర లోకనాధం, తామాడ పద్మావతి, మజ్జి సునీత, తదితరులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమం

విశాలాంధ్ర-ఆమదాలవలస: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకం అందించటమే లక్ష్యంగా ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి పని చేస్తున్నారని యువనేత ధర్మాన రామ్మోహర్ నాయుడు అన్నారు. చింతాడ గ్రామ సచివాలయం పరిధి టీ మన్నయ్యపేట, కే మన్నయ్యపేట, నందగిరిపేట, తురకపేట, కంచరాపువాని పేట, సనపలవానిపేట, నాధానపురం, గ్రామంలలో 165 వ రోజు బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఈ కార్యక్రమం లో భాగంగా ప్రజలవద్దకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా, వాలెంటీర్స్ సిబ్బంది మరియు సచివాలయం సిబ్బంది ఇంటి ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు యొక్క వివరాలు తెలియజేస్తున్నారా అని గ్రామస్థు లుకు వివరాలు అడిగి తెలుసుకుంటూ, ప్రతి ఇంటికి అమలైన పథకాలను ప్రజలకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలతో మమేకంగ కలిసి మాట్లాడి గత ప్రభుత్వ ముకు మరియు ప్రస్తుత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించి, ప్రజలకు మరియు ప్రభుత్వానికి మధ్య దళారీ వ్యవస్థ లేకుండా, మధ్యవర్తి లేకుండా, లంచాలు లేకుండా, అర్హత కలిగిన ప్రతి ఒక్క పేదవారికి సంక్షేమ పథకాలును అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో కమిషనరు ఎం.రవిసుధాకర్, ఏ.ఈ కె.అప్పలనాయుడు, టి.పి.ఎస్ హెచ్.వి. సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సి.హెచ్ వెంకటరమణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోర చిన్నం నాయుడు, శ్రీకాకుళం మండల ఎంపీపీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు, గుండ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత మహోత్సవాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జనవరి 20 నుండి ఫిబ్రవరి 19 వరకూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రహదారి భద్రతా మాహోత్సవాల్లో భాగంగా బుధవారం నగరంలో గల బాపూజీ కళామందిర్ లో నగర ట్రాఫిక్ పోలీసులు ఆటో డ్రైవర్లతో ప్రత్యేకమైన అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అందులో ఆటో ఎక్కే ప్యాసింజర్స్ పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని అలానే ఆటోలో సంఖ్యకు మించి ప్యాసింజర్లను ఎక్కించకూడదని వారు ఎక్కడికి వెళ్లినా వారి యొక్క రికార్డ్స్ మెయింటైన్ చేస్తూ తమతో తీసుకొని వెళ్లాలని, హైవేలో వెళ్ళినప్పుడు వారు సర్వీస్ రోడ్డు మాత్రమే ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా, వారి అందరూ మేలుకోరి డా. పిఎల్ఎన్ రాజు చే ఆటో డ్రైవర్ల అందరికీ ఉచితంగా కళ్ల తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా మోటారు వెహికల్ ఇన్స్పెక్టర్ వారి చేత లైవ్ ఆక్సిడెంట్ వీడియోలు స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ వారికి తగిన సూచనలు జాగ్రత్తలను తెలియజేశారు. రెడ్ క్రాస్ మెంబర్స్ ఫస్ట్ ఎయిడ్ ఏ విధంగా చేయాలి మరియు అత్యవసర పరిస్థితుల్లో సిపిఆర్ ఎలా చేయాలి అనే విధానాన్ని కూడా అందరికీ వివరించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ జి ఆర్ రాధిక, శ్రీకాకుళం ఎస్డిపిఓ వై శృతి, ట్రాఫిక్ సిఐ అవతారం, ఎంబిఐ ఇన్స్పెక్టర్ గంగాధర్, అనిల్, ఎస్ఐవోస్ అందరూ కూడా పాల్గొన్నారు.

జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకు పనికిరాడు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు
- అచ్చెన్నాయుడు సమక్షంలో పలువులో టీడిపిలోకి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి: తనసొంత తల్లి, చెల్లితో పాటు కుటుంబసభ్యులకు ఆదరించనివాడు రాష్ట్రంలో ఉన్న ఐదుకోట్లమందికి ఏమి న్యాయంచేస్తాని జగన్మోహన్‌రెడ్డి రాజకీయాలకు అసలు పనికిరాడని టెక్కలి నియోజకవర్గ శాసన సభ్యులు, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండలం చిన్నసాన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సంబాళ్ళ రాజశేఖర్, వైకాపా నాయకులు చిన్నసాన మాజీ సర్పంచ్ ఎండ నాగేశ్వరరావులతో పాటు చిన్నసాన, జీయన్నపేట పంచాయతీలకు చెందిన పలు కుటుంబాలు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడిపిలో చేరారు. వీరికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి పార్టీలోకి సాదారణంగా అహ్వానించారు. అంతకు ముందు ఆయన స్థానిక టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో విలేకర్లు సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి పార్టీ పెట్టినప్పటి నుంచి ఆయనతో ఉండి జగన్ జైలుకు వెళ్ళినప్పుడు అండగా ఉన్న వైకాపా ముఖ్య నాయకులు ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డిపై సమ్మకంలేక, జగన్ రాజకీయాలకు పనికి రాడని త్వరలో చంద్రబాబు ఆద్వర్యంలో టీడిపిలో చేరు తున్నారని ఆయన తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి అయన తరువాత ఏపీకి రాజదాని అంటే చెప్పలేని పరిస్థితి దాపురించిందని, మూడురాజదానుల పేరుతో ఉత్తరాంధ్ర సహజ సంపదను దోచుకున్నా రని తెలిపారు. వైకాపా పాలనలో అన్ని రకాల ప్రజలు ఇబ్బందులు పడ్డారని, మరో మూడు నెలలో జనసేనా, టిడిపిల కలయకతో ప్రభుత్వం ఏర్పడు తుందని ఆయన జోస్యం చెప్పారు. ఇక టెక్కలి నియోజకవర్గానికి వస్తే ఇక్కడ వైసీపీకు నాయకత్వంమే లేదని, ఇక్కడ ఉన్న నాయకుడుకి టిడిపి నాయకులకు తిట్టడం తప్ప చేసిందిఏమిలేదని ఆయన దుయ్యబట్టారు. టెక్కలి నియోజకవర్గం టిడిపి లోనే అభివృద్ధి చెందిందని, మళ్ళీ టీడీపీ అధికారంలోకి పచ్చిన వెంటనే టెక్కలి నియోజక వర్గాన్ని పారిశ్రామిక వాడ తయారు చేస్తానని, యుతకు ఉద్యోగాలు, వ్యాపారాలతో బిజీగా ఉండేవిధంగా చేస్తానని మాట ఇస్తున్నానని అయన తెలిపారు. కోటబొమ్మాళి మండలం చిన్నసాన పంచాయతీలో గతంలో సాగునీరు లేక చాలా ఇబ్బందులు పడ్డారని నేను మంత్రి అయన తరువాత ఆ ప్రాంతానికి లిఫ్టిఇరిగేషన్ తెచ్చి పంటలు పండేవిధంగా చేసానని కానీ ఇప్పుడు ఆ ఎత్తిపోతలపథకాన్ని నడపలేని, చేతకాని నాయకులు వైసీపీ వారని అయన అన్నారు. వచ్చే ఎన్నికల్లో మీరంతా టిడిపికి ఓటువేసి జగన్‌రెడ్డి రాష్ట్రంలో లేని విధంగా టిడిపి, జనసేన పార్టీలను గెలిపించాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరాజులు, టెక్కలి మండల పార్టీ అధ్యక్షుడు బగాది శేషు, మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, టిడిపి నాయకులు సంబాళ శ్రీనివాస్, కర్రి అప్పరావు, గొండు లక్ష్మణరావు, సాసుమహంతి ఆనందరావు, హనుమంతు అప్పలరాజు, శిమ్మ సింహాచలం, దేవాది సింహాద్రి, బెండి అన్నపూర్ణ, కల్లి లక్ష్మణరెడ్డి, నాగయ్యరెడ్డి, వాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు వైసీపీలోకి వచ్చారు... ఇప్పుడు మళ్ళీ టీడీపీకి వెళ్ళారు

- వారంతా టీడీపీ వారే...
- ఎంపీపీ ఉమామల్లేశ్వరరావు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం చిన్నసాన పంచాయతీకి చెందిన పలువురు (ప్రస్తుత వైసీపీ) నాయకులు బుధవారం అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారని, గొప్పలు చొప్పుకుంటున్న టిడిపి నాయకులు పార్టీలో చేరిన వ్యక్తులు గతంలో ఏ పార్టీకి చెందిన వారో గుర్తు చేసుకోవాలని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు అన్నారు. చిన్నసాన, జీయన్నపేట పంచాయతీలకు చెందిన ఈ వ్యక్తులు 2019 ఎన్నికల ముందు టీడీపీలోనే ఉన్నారని, తరువాత వైఎస్సార్‌సీపీ పార్టీలోకి వచ్చారని, ఇప్పుడు మళ్ళీ అదే పార్టీలోకి వెళ్ళారన్నారు కానీ వీరువెళ్ళినంత మాత్రనా పార్టీకి ఎలాంటి నష్టం లేదన్నారు. నిజమైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు టిడిపి నాయకులు డబ్బులు ఇస్తాము, పదవులు ఇస్తాము అని అశచూపి మభ్యపెట్టినా వారు ఆ పార్టీలోకి వెళ్లరని ఆయన స్పష్టం చేశారు. టెక్కలి నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో వైకాపా గెలిచిన తరువాత సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండలాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏదో అశ కలిగి వైకాపాలో చేరారని, వారి ఆటలు ఇక్కడ సాగకపోవడంతో మళ్ళీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వారంతా టిడిపిలోకి వెలుతున్నా రన్నారు. దీనిని టిడిపి నాయకులు బూతద్దంలో పెట్టి జనాలకు చూపిస్తున్నారని, నిజానికి ఒక్క నిజమైన వైసీపీ నాయకులు, కార్యకర్త అయినా టిడిపిలో వచ్చారా అని ఆయన పేర్కొన్నారు. టిడిపి నాయకులు ఎన్ని చెప్పినా ప్రజలు సమ్మరని, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకే అందుతున్నాయని, అలాంటప్పుడు ప్రజలు చంద్రబాబునాయుడుకు ఎందుకు ఓటు వేస్తారని, మళ్ళీ జన్మభూమి కమిటీలు రావాలని ఎవ్వరైన కోరుకుంటారా...అని తెలిపారు. టిడిపి నాయకులు వాపును చూపి బలుపు అనుకుంటున్నారని నిజం తెలుసుకొని మాట్లాడాలని అయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పేడాడ వెంకటరావు, బమ్మిడి గణపతిస్వామి, సింగుపురం వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు

విశాలాంధ్ర-కవిటి: వసంత పంచమి సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని బెజ్జిపుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహానికి మాజీ జడ్పిటిసి సభ్యులు పి కృష్ణారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా అక్షరాభ్యాసంలో పాల్గొన్న చిన్నారులకు పలక, బలపంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్పీ నారాయణస్వామి, పివిఎస్ రాంబాబు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో... మండల కేంద్రంలోని శ్రీ కళ్యాణి ఆంగ్ల పాఠశాల ఆవరణంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల నుండి 67 మంది విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి అక్రభ్యాస కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వేద పండితులు పురోహితులు ఆధ్వర్యంలో ముందుగా పిల్లల గోత్రనామాలతో సరస్వతి దేవి పూజ జరిపి అనంతరం హెూమం చేపట్టిన అనంతరం వివిధ సరస్వతి దేవాలయాలను తెచ్చిన కుంకుమతో పూజలు చేపట్టి సరస్వతీ మాత ఆలయం నుండి తెచ్చిన రక్షలు విద్యార్థులకు కట్టి విద్యార్థులకు అక్షభ్యాసం కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఏవో రాణి,విద్యార్థుల తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కే కొత్తూరు ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో, జగతి గ్రామంలోని పివిఆర్ భారతీయ విజ్ఞాన భారతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు డిలేశ్వరావు ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతీదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సోంపేట : శ్రీపంచమి సందర్భంగా పట్టణంలోని సంస్కారభారతి ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు గాయత్రిదేవి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరారు. విద్యార్థులతో కలిసి ఈ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద విద్యా కేంద్ర శిశుమందిర్, మహర్షి విద్యానికేతన్, శ్రీనివాస విద్యానిలయంలో కూడా శ్రీపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా గద్దర్-2

విశాలాంధ్ర-శ్రీకాకుళం : బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్ల సునామీ సృష్టించిన గదర్2ని వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా తెలుగులో ప్రసారం చేయనుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమోషనల్ఎంటర్టైనర్ గదర్ 2, ఈ నెల 18 వ తేది సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. అనిల్ శర్మ దర్శకత్వంలో 2001లో వచ్చిన బ్లాక్ బస్టర్ గదర్, ఏక్ ప్రేమ్ కథ'కు సీక్వెల్గా ఈ సినిమా తెరకెక్కిందన్నారు. బాలీవుడ్ స్టార్యాక్టర్స్ సన్నీ డియోల్, అమీషా పటేల్, ఉత్కర్ష్ శర్మ నటించిన ఈ చిత్రం 1971 ఇండో-పాకిస్థాన్ యుద్ధంలో తారా సింగ్ (సన్నీ డియోల్)ప్రయాణమే ప్రధాన ఇతివృత్తంగా తెరకెక్కిందని వివారించారు.జైలులో ఉన్న తన కుమారుడు చరణ్జీత్సింగ్ (ఉత్కర్ష్ శర్మ) ను రక్షించడానికి పాకిస్థాన్ నుంచి తిరిగివచ్చిన తారా సింగ్ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొన్నాడనేది ఈ సినిమా కథన్నారు. థియేట్రికల్ రిలీజ్సక్సెస్ తర్వాత 18న సాయంత్రం 5:30 గంటలకు జీ తెలుగులో ప్రసారం కానున్న 'గదర్ 2' ప్రేక్షకులకు అదిరిపోయే వినోదాన్ని పంచడానికి సిద్ధమైందన్నారు.తెలుగు ప్రీమియర్గా ప్రసారం కానున్నబాలీవుడ్ బ్లాక్ బస్టర్ సినిమా గదర్ 2ని జీ తెలుగు వేదికగా ఈ వారాంతంలో వీక్షకులందరూ మిస్సవకుండా వీక్షించాలన్నారు.

గరీబ్ గైడ్ కే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ

విశాలాంధ్ర-జలుమూరు : మండలం చిన్నదూగాం పంచాయతీ పరిధి తిలారు జంక్షన్లో ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయ 62వ వార్షికోత్సవాలు ఈ నెల 20 నుంచి 24 వరకు జరగనున్నాయి. ఈ వార్షికోత్సవ వేడుకల్లో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ గరీబ్ గైడ్ సంస్థకు అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినట్లు సంస్థ అధ్యక్షురాలు భార్గవి తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంస్థ చేస్తున్న కృషిని కోర్టు గుర్తించిందన్నారు.

శతాధిక వృత్తురాలు మృతి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం సరసావురం పంచాయతీ ఏర్నాగులపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు షవ్వాన రామరత్నం 105 సంవత్సరాలు బుధవారం మృతి చెందారు.

శతాధిక వృద్ధురాలైన ఈమేకు తెలుగుదేశం పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు, సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ కోశాధికారి శవాన ప్రసాద్‌తో పాటు, ముగ్గురు కుమారులు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతి పట్ల సంతబొమ్మాళి మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్ష కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న తో పాటు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పాలవలసలో సరస్వతి విగ్రహం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం పాలవలస గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం శ్రీ పంచమి సందర్భంగా సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు.

గ్రామానికి చెందిన కర్రి పాపారావు దంపతులు తండ్రి దివంగత రామస్వామి జ్ఞాపకార్థం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్‌తో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.